అకాల వర్షం.. అపార నష్టం

- కోళ్ల షెడ్లు నేలమట్టం
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు



డోర్నకల్: మన్నెగూడెంలో చనిపోయిన కోడిపిల్లలను చూపుతున్న బాధితుడు నెహ్రూ



కురవి: సీరోలు-మన్నెగూడెంల మధ్య రోడ్డుపై విరిగిపడిన చెట్లు



డోర్నకల్: రాలిన మామిడి కాయలు చూపుతున్న రైతు



మహబూబాబాద్: కూలిన చెట్టు



గార్ల: విరిగిన విద్యుత్ స్తంభం



కురవి మండలంలో నేలవాలిన వరి



బయ్యారం: గాలికి లేచిపోయిన రేకులు

డోర్నకల్: మండలంలోని దాన్యాతండా, సీరోలు మండలంలోని మన్నెగూడెంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం, పెనుగాలులతో కోళ్ల షెడ్లు నేలమట్టమయ్యాయి. మన్నెగూడెంలో తేజావత్ నెహ్రూకు చెందిన కోళ్ల షెడ్డు ఈదురు గాలులకు కూలడంతో 2వేలకు పైగా కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. కోడి పిల్లలతోపాటు షెడ్డు నేలమట్టమవడంతో రూ.8లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు నెహ్రూ వాపోయాడు. పంజాల సైదులుకు చెందిన భారీ షెడ్డు కూలింది. దాన్యాతండాకు చెందిన రైతు శంకర్‌కు వర్షం, గాలులు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. ఆయన రెండు కోళ్ల షెడ్లు కూలగా సుమారు 3వేల కోళ్లు, 2వేల కోడిపిల్లలు చనిపోయాయి. సమీపంలోని విద్యుత్ స్తంభం కూలగా భారీ వృక్షం శంకర్‌కు చెందిన వరిపొలంలో కూలింది. తాను డీసీసీబీ బ్యాంకు నుంచి రూ.10లక్షల రుణం పొంది కోళ్ల ఫారం ఏర్పాటు చేశానని షెడ్లు కూలి నష్టం వాటిల్లడంతో రుణంపై ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని శంకర్ కోరారు. చిలుకోడుతోపాటు డోర్నకల్ సమపంలోని మామిడి తోటలలో చెట్లపై కాయలు గాలులకు నేలరాలాయి. గాలులతో మామిడి కాయలు రాలి తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు నంద్యా నాయక్ వాపోయాడు.

కురవి: సీరోలు, కురవి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షంతోపాటు గాలి, రాళ్ల వానకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. సోమవారం బాధితులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరాడు. కురవి మండల కేంద్రంలో ఒక వ్యక్తి ఇంటిపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో ఇంటిపై కప్పు రేకులు పగిలిపోయాయి. చింతపల్లి శివారులోని సీరోలు క్రాస్‌రోడ్డు వద్ద భూక్య వెంకన్న-కవిత దంపతులకు చెందిన కోళ్ల ఫారం పైకప్పు సిమెంట్ రేకులు ఎగిరి కిందపడడంతో పగిలిపోయాయి. కోళ్లఫారం కోసం నిర్మించిన మినీ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం అయింది. అలాగే సీరోలు నుంచి మన్నెగూడెం వెళ్లే రహదారిలో చెట్టు కూలి రోడ్డు మీద పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కురవితోపాటు సీరోలు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలవాలిపోయింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. బాధితులకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

బేతోలు గ్రామంలో..

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో గాలివాన బీభత్సంతో పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. సుమారు 9 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

విరిగిన 32 విద్యుత్ స్తంభాలు

గార్ల: మండలంలో 32విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఏఈ రాత్రి ఒంటి గంటకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బయ్యారం: మండలంలోని బయ్యారం, జగ్గతండా, ఉప్పలపాడు, గంధంపల్లి, కొత్తపేట, నామాలపాడు, వెంకట్రాంపురం, బాలాజీపేట తదితర గ్రామాల్లో ఉరుములతో కూడిన గాలివాన స్థానికుల్లో భయాందోళనలు సృష్టించింది. ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. మామిడికాయలు భారీ సంఖ్యలో రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

క్లుప్తంగా

రేపు సదరం క్యాంపు

గూడూరు: ఈనెల 24 వ తేదీ బుధవారం మానుకోట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపును మండలంలోని అర్హత కల్గిన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి కోరారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ.. క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు తమ సర్టిఫికెట్లు, ఎక్స్‌రేలు స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో నమోదు చేసుకోవాలని కోరారు. వారు ఇచ్చే చార్ట్‌తో మీ సేవా కేంద్రంలో చాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. రశీదుతో అన్ని రకాల సర్టిఫికెట్‌లతో జిల్లా కేంద్రంలో జరిగే సదరం క్యాంపునకు హాజరుకావాలన్నారు.

108 సిబ్బందికి ఉత్తమ అవార్డులు



నెహ్రూసెంటర్/కురవి: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి సకాలంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడిన 108 పైలట్ జక్కుల వీరన్న, ఈఎంటీ గాంధీ ఉత్తమ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో 108 వాహనాల సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖలీద్, డైరెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా సోమవారం ప్రశంస పత్రంతోపాటు నగదు పురస్కారం అందుకున్నారు. వీరిని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భూమ నాగేందర్, ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ బత్తిని మహేష్ అభినందించారు.

వెండి కలశం బహూకరణ



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయానికి అయోధ్యపురం గ్రామానికి చెందిన అమెరికాలో ఉంటున్న బీరవెల్లి తరుణ్‌కుమార్‌రెడ్డి అందించిన రూ.1లక్ష 9వేల విలువ చేసే వెండి కలశాన్ని వారి కుటుంబ సభ్యులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బీరవెల్లి వేణుగోపాల్‌రెడ్డి ఆలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్ రెడ్డికి సోమవారం అందించారు.

సన్మానం



పెద్దవంగర: జ్ఞాన సముపార్జన ఒక్క గురువుతోనే ప్రాప్తిస్తుందని పెద్దవంగర, తొర్రూరు మండల నోడల్ అధికారులు బుధరాపు శ్రీనివాస్, మహంకాళి బుచ్చయ్య అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగర ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కల్వాని వెంకట్ రెడ్డి పదవి విరమణ పొందగా అభినందన సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చిట్యాల కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జన్నపురెడ్డి యాకుబ్‌రెడ్డి, వల్లాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కుల దేవతలను పూజించడం ద్వారా ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందుతుందని శాసన మండలి ఉప సభాపతి బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠిస్తున్న పెద్దమ్మ తల్లి విగ్రహాల పండుగ వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, సహదేవ్, మల్లేశం, సోమయ్య, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పెద్దచెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ మట్టిని నింపుకొని రైతు పొలంలోకి వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడిపోయింది. విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కురవి: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. సోమవారం ఓటింగ్‌పై డోర్నకల్ నియోజకవర్గంలోని సీరోలు మండలంలోని వివిధ గ్రామాలల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని రంగోలి, సమావేశాలు, ప్రతిజ్ఞలు చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వశక్తి మహిళా సంఘాలు, మెప్మా సంఘాలు, సమాచార పౌర సంబంధాల శాఖ కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆవు మృతి

మహబూబాబాద్ రూరల్: కారు ఢీకొని ఆవు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ధరణి ఆస్పత్రి సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జిల్లా కేంద్రం నుంచి బయ్యారం వైపునకు వెళ్తున్న ఓ గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఆవును ఢీకొట్టి వెళ్లింది. గాయాలైన ఆవు కొంత సమయం తరువాత మృతి చెందిందని స్థానికులు తెలిపారు. దాని విలువ రూ.80వేలు ఉంటుందని యజమాని గుగులోత్ నరేందర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అన్నప్రాసన

మరిపెడ రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, పాటలు, పౌష్టికాహారం అందిస్తూ వారి భవిష్యత్‌కు గట్టి పునాదులుగా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. మండలంలోని యలమంచిలితండా గ్రామ పంచాయతీ, వీరారం సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే, అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భూ కాలుష్యాన్ని తగ్గించాలి



పెద్దవంగర: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్



మహబూబాబాద్ రూరల్: ధరిత్రి దినోత్సవ సూచనలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పెద్దవంగర: భూ కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిరి శ్రీనివాస్ అన్నారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ధరిత్రి కాలుష్యం ఎలా అవుతుంది. కాలుష్య నిర్మూలనకు చేపట్టాల్సిన అంశాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు యాకయ్య, రాజలింగం, షౌకత్ అలీ, గౌరీ శంకర్, అంజన్న, సదన్న, సువర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఆమనగల్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కల్లెం వెంకటరెడ్డి అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సోమవారం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, కవిత, జనార్దన్, శశిధర్, బలాష్టి రమేష్, వెంకటేష్, యుగంధర్, బాలాజీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దంతాలపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి చెట్లు పెంచాలని ప్రతిజ్ఞ చేయించారు.

పేదల హక్కుల కోసం పోరాడుదాం

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావం, లెనిన్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల హక్కుల సాధన కోసం ప్రతిఘటన పోరాటాన్ని ఎత్తిపడదామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



నెహ్రూసెంటర్: లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: అంజనాపురంలో..



కేసముద్రంలో..



డోర్నకల్: తహసీల్దారు బంజరలో..

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



నెహ్రూసెంటర్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్ రమాదేవి అన్నారు. మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అనే నినాదంతో ముద్రించిన కరపత్రాలను సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈనెల 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, కిషన్‌నాయక్, ప్రశాంత్, న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బాబన్న, పీవైఎల్ జిల్లా కార్యదర్శి యాకయ్య పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

బయ్యారం: పార్లమెంటు ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన సీపీఎం విస్తృత జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మండా రాజన్న, మధు, వెంకన్న, యాకూబ్, మోహన్, భిక్షం, పెంటయ్య, వెంకన్న, పురుషోత్తం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డీఈఈ కిశోర్‌కుమార్‌పై విచారణ



మహబూబాబాద్: ఇరిగేషన్ డీఈఈ కిశోర్‌కుమార్‌పై ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. కాగా వారి ఫిర్యాదు మేరకు పాలకుర్తి ఈఈ రమేష్ విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా సోమవారం నిజాం చెరువును ఈఈ రమేష్ సందర్శించి మట్టి తవ్వకాలు, చెరువులో ఉన్న రోడ్డు తొలగింపు తదితర విషయాలపై విచారణ చేసినట్లు బాధితుడు అహ్మద్‌ఖాన్ తెలిపారు. నిజాం చెరువు మత్తడిని పరిశీలించారు. మరోసారి విచారణ చేసి నివేదిక అధికారులకు అందజేస్తామన్నారు.

బీఎస్పీ స్టార్ క్యాంపెయినర్‌గా శివరాజ్



మహబూబాబాద్ అర్బన్: దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార సభల్లో పాల్గొన్నడానికి బీఎస్పీ స్టార్ క్యాంపెయినర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన దార్ల శివరాజ్‌ను నియమిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సోమవారం తెలిపారు.

నివాళి

తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు మొగుళ్ల ముత్తమ్మ చిత్రపటానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు న్యాయం

తొర్రూరు: బీజేపీతోనే పేద వర్గాలకు న్యాయం జరుగుతుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు అన్నారు. వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోరుతూ సోమవారం డివిజన్ కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు జగదీష్, సందీప్, శేఖర్ పాల్గొన్నారు.

పార్టీ బాధ్యతల నుంచి బహిష్కరణ

బయ్యారం: ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సనప పొమ్మయ్యను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ప్రాథమిక సభ్యత్వం, నిర్మాణ బాధ్యల నుంచి బహిష్కరించాలని గార్లబయ్యారం సబ్ డివిజనల్ కమిటీ సోమవారం ఏకగ్రీవంగా నిర్ణయం చేయడం జరిగిందని ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ తెలిపారు. సోమవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జడ సత్యనారాయణ, ఊకే పద్మ, రామగిరి బిక్షం, మాదంశెట్టి నాగేశ్వరరావు, తుడుం వీరభద్రం, పాక వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులు

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దుబ్బెట సహస్ర, షేక్ జావిద్‌లు గురుకులంలో సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం కడియం వెంకటయ్య సోమవారం తెలిపాడు.

ఎస్ఈఓటీలో సత్తచాటిన విద్యార్థులు



దంతాలపల్లి: ఈనెల 21న హనుమకొండలో నిర్వహించిన సంక్షేమ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎస్ఈఓ) అర్హత పరీక్షలో దంతాలపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థులు నాలుగు సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ సోమవారం తెలిపాడు. 7వ తరగతి విద్యార్థులు ఎం.సిద్ధు, ఆర్.వైశాంత్, వి.సాయివర్షిత్, ఏ.రుషి అర్హత సాధించారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మహబూబాబాద్ రూరల్: గాలివాన దుమారానికి మండలంలోని జంగిలిగొండ గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా వచ్చే 33కేవీ లైన్‌లో బ్యాక్ క్లాంప్ విరిగింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సోమవారం విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో రూరల్ ఏఈ భోజ్యానాయక్, సబ్ ఇంజనీర్ లక్ష్మణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్‌మన్ సత్యనారాయణ, కట్టర్ల సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మానుకోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోత్‌దస్రూనాయక్, గంట సంజీవరెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ పాల్గొన్నారు.

గ్రామీణ పండుగలు ఐక్యతకు నిదర్శనం

తొర్రూరు రూరల్: గ్రామీణ పండుగలు ఐక్యతకు నిదర్శనం అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని అమ్మాపురంలో సోమవారం రాత్రి నిర్వహించిన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ, అమ్మవారి శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో దయాకర్‌రావు పాల్గొన్నారు. గ్రామస్తులతో కలసి బోనమెత్తారు. ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు నూతన భవనం ప్రారంభం

కురవి: యూనియన్ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సీరోలు మండల కేంద్రంలో శివాలయ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాంపల్లి-సీరోలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ రీజినల్ హెడ్ పలుగుల సత్యం, వరంగల్ డిప్యూటీ రీజినల్ హెడ్ మహేష్, స్థల దాత వెడవెల్లి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకటరెడ్డి, బ్యాంకు మేనేజర్ సంతూలాల్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న జీఎం

బీఆర్ఎస్‌ను ఖాళీ చేద్దాం



ప్రచారం చేస్తున్న నాయకులు

గూడూరు: పార్లమెంట్ ఎన్నికల తరువాత తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేద్దామని కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధాబాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి అన్నారు. మండలంలోని తీగలవేణి, లక్ష్మీపురం, పడమటితండా గ్రామాలలో సోమవారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి.యాకూపాషా, అమరేందర్‌రెడ్డి, వెంకన్న, శివ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు



పూజలో పాల్గొన్న సీతారాంనాయక్

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దంపతులు, కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ఎంపీగా నామినేషన్ వేసేందుకు వెళ్లే క్రమంలో నామినేషన్ పత్రాలను స్వామి వారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొణతం పెంటయ్య, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు అశోక్, అనిల్, శంకర్‌రావు పాల్గొన్నారు.